# జీవచ్ఛవం

''రసాలు ఎనిమిది...శాంతం కూడా రసమే కాబట్టి రసాలు తొమ్మిది... భక్తిని కలుపుకొని రసాలు పది...వినయం మరికొన్నిట్నీ కూడా రసాలుగా లెక్కించవచ్చు కాబట్టి రసాలు అనంతం... ఇలా రసాల గూర్చి మన ప్రాచీనాలంకారికులలో, సాహిత్య విమర్శకులలో భిన్నాభిప్రాయాలున్నాయి... అయినా నవ రసాలన్న వాదమే చాలామందికి ఆమోదయోగ్యమై రూఢికెక్కింది...కాని, చంద్రావును చూస్తుంటే రసాలే లేవనిపిస్తుంది. అతనిలో ఏ రసోత్పత్తీ జరుగుతుందని నేననుకోను..'' తూటాలాంటి మాట పేల్చాడు సారథి...

సారథి నాకు మంచి మిత్రుడు...సమాజం గూర్చి మంచి అవగాహన వున్నవాడు...ప్రాచీన, ఆధునిక సాహిత్యాల్లో సమానమైన అభినివేశం వున్నవాడు... ఆధునిక వచన సాహిత్యంలో నవరసాలు అనే అంశంపై పరిశోధనచేసి యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పట్టాకూడా తీసుకున్నాడు... అలాంటి మేధావి సారథి నుంచి ఈ మాటలు రావడం నాకాశ్చర్యంగా వుంది... సారథి మాటల గూర్చి మననం చేసుకుంటున్న నాకు చంద్రావు జ్ఞాపకం వచ్చాడు...అతని అలవాట్లు జాపకం వచ్చాయి... అతని ఆకారం కళ్ళముందు కదిలింది.

చప్పిడి దవడలు, లోతుకెళ్లిన కళ్ళు.. ఈడ్చుకు పోయున్న ముఖం... సగం నెరసిన వెంట్రుకలు..చిన్నముక్కు..సన్నటికాళ్ళు.. ఇదీ చంద్రావు ఆకారం...అతని ముఖంలో ఏ భావమూ కనబడదు..అతడు నేను పనిచేసే ఆఫీసులోనే పనిచేస్తాడు. ఇల్లు, ఆఫీస్ తప్ప అతడు మరి దేన్నీ పట్టించుకోడు..అతనికి దేనిమీదా ఆసక్తిలేదు...రొటీన్ రొటీన్ రొటీన్ బతుకు.. అతన్ని చూస్తే చార్లీచాప్లిన్ సినిమా చూస్తున్నప్పుడు వచ్చే విషాదభరిత నవ్వు నవ్వాలనిపిస్తుంది.. అతనిపై జాలికూడా కలుగుతుంది.. అంటే హాస్యకరుణ రసాలాతన్లో ఉన్నట్టే కదా.. అదే విషయం సారథి నడిగాను.. అతని స్టేట్మెంట్ తప్పన్నాను.

నా మాటలు విని చిన్నగా నవ్వాడు సారథి... ''మనోహర్! నా మాటల్ని నువ్వు సరిగ్గా అర్థం చేసుకోవడం లేదు..చంద్రావును చూస్తే ఇతర్లలో ఏ రసమూ ఉత్పత్తి కాదని నేను చెప్పడం లేదు... ఆయా వ్యక్తుల్లో వాసనా రూపమున నిగూఢంగా వుండే వికారాలను బట్టి, వాళ్ళవాళ్ళ సంస్కారాలను, మనస్థితి ననుసరించి, స్పందనలను బట్టి వాళ్ళలో రసోత్పత్తి జరుగుతుంది... నేననేది చంద్రావులో

ఏ రసమూ ఉత్పత్తి కాదని..అతన్లో రసోత్పత్తి కవసరమయ్యే ఏ వాసనా లేదని...'' అన్నాడు సారథి...

అవును...సారథి మాటల్ని నేను తప్పుగా అన్వయించాను..కావ్యాన్ని చదివినప్పుడు పాఠకునిలో రసోత్పత్తి జరుగుతుంది కాని కావ్యానికి కాదు...నేను చెప్పిందాన్నిబట్టి కావ్యానికే రసోత్పత్తి జరగాలి... నా అన్వయాన్ని సరిచేసుకున్నాను... అంటే చంద్రావనే పాఠకుడిలో ఈ సమాజమనే కావ్యంలోని ఏ సంఘటనా, ఏ వస్తువూ, ఏ విషయమూ స్పందింపజేయలేదంటాడు సారథి...సారథి ఎంత డ్సాక్టరేట్ చేసినవాడయినా అతని అభిప్రాయం తప్పనిపిస్తుంది. నాకు...సారథంత కాకున్నా నాకూ రససిద్ధాంతం గూర్చి కొంత పరి జ్ఞానముంది...నేను ఎమ్మే తెలుగు పాసయ్యాను..కొద్ది క్షణాలు సారథి మాటలు గూర్చి లోతుగా ఆలోచించాను...శృంగారాన్ని రసరాజమన్న భోజుడి మాటలు జ్ఞాపకం వచ్చాయి... నాలో ఆలోచన తళుక్కునమెరిసింది...''సారథి! నీ మాటలు తప్పు..మిగతా వాటి సంగతి తర్వాత కాని మొదట శృంగారాన్నిగూర్చి చూద్దాం...చంద్రావుకో భార్య వుంది... ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారన్న సంగతి నీకు తెలుసనుకుంటాను. నువ్వు చెప్పినట్టాతనిలో నవరసాల్లో ఏ రసమూ అంటే శృంగారం కూడా ఉత్పత్తి కాకుంటే అతనికి పిల్లలెలా పుట్టారు...?'' అని ఏదో కనిపెట్టిన వాడిలా నవ్వాను నేను...

సారథి నన్ను చిన్న పిల్లాడిని చూసినట్టు చూసాడు... ''మనోహర్..! ఏ అందమైన వస్తువును చూసైనా చంద్రావు స్పందించగా నీవు చూసావా...? ఈ విషయం సరైందని నేననడం లేదుకాని చంద్రావు ఏ రోజైనా సెక్సుగురించి మాట్లాడగా నువ్వు విన్నావా...? మన సంభాషణల్లో స్త్రీ వస్తే అతడు మౌనం వహిస్తాడు... ఏ స్పందనా కనబరచడు... అలాగని అతని సెక్సు సామర్థ్యాన్ని శంకించాల్సిన అవసరం లేదు... అతడు భార్య అందచందాలనో, ఒంపుసొంపులనో చూసి శృంగార క్రీడల్లో పాల్గొంటాడని నేననుకోను.. ఆమె భార్య కాబట్టి ఓ ఫైలుమీద చెయ్యేసినట్టు ఆమె మీద చెయ్యేస్తాడనుకుంటాను.. ఏ విధంగా చెయ్యేసినా పిల్లలు పుట్టడం ఆగదు కదా...! మన ప్రబంధాల్లో చెప్పినట్టు దక్షిణ నాయకుడయితేనే శృంగార రసాన్ని పోషించే వాడనినేనంను...కాని మొక్కుబడి కోసం భార్యతో సెక్సు క్రీడల్లో పాల్గొనడం కూడా శృంగార రసమని నేనను...''

బాగా ఆలోచించిన నాకు సారథి తర్కంతో ఒప్పుకోక తప్పలేదు...కాని చంద్రావులో నవరసాల్లో ఏ రసమూ వాసనా రూపంగా కూడా లేదనడంతో ఏకీభవించలేకపోతున్నాను...అతని మాటల గూర్చే ఆలోచిస్తున్నాను...

''ఇక వీర రసం సంగతి...దీనికి స్థాయీ భావమేంటీ...? ఉత్సాహం...దీని స్వరూపం లోకోత్తర కార్యాలను చేయాలనే తపన... తన శరీరం గూర్చి తనకే పట్టింపులేని చంద్రావుకు కుటుంబం గూర్చికూడా శ్రద్ధచూపని చంద్రావుకు - ఇంక్రిమెంటొచ్చిందన్నా, ప్రమోషనొచ్చిందన్నా, కరువు భత్యం పెరిగిందన్నా ముఖంలో ఏమాత్రం మార్పుచూపని చంద్రావుకు ఏ పనిమీద, ఏ లోకోత్తర కార్యం మీద ఉత్సాహం వుందో ఎవరైనా చెప్పగలరా...? అసలాతడు ఏ విషయం గురించయినా ఆసక్తి చూపగా నువ్వు చూసావా...? అలాంటప్పుడాతనిలో వీర రసోత్పత్తి జరుగుతుందనే అవకాశం వుందా..?'' అన్నాడు సారథి..

బతకడమే కష్టంగా భావిస్తూ దేనిమీదా ఉత్సాహం చూపకుండా పీనుగులా బతుకుతున్న చంద్రావులో వీరరసం ఉందని నేనెలా చెప్పగలను...? దాన్ని గురించి నేనాలోచించనే లేదు.. ఈ విషయంలో సారథి చెప్పకున్నా నేనంగీకరించేవాడినే.. సారథి మాటలకు అంగీకార సూచకంగా తలూపాను...

''సారథీ! నువ్వెన్నైనా చెప్పు...చంద్రావులో ఏ రసమూ లేదన్న నీవాదంతో నేనంగీకరించలేక పోతున్నాను.. మన ప్రాచీనాలంకారికులు చెప్పినట్లు ధీతోదాత్త నాయకులకుండే వీర, శృంగార రసాలు అతనికి లేకపోవచ్చు.. కాని దుఃఖం, శాంతం, భయం, హాస్యం, క్రోధం లాంటివి కూడా ఉండవని నేననుకోను.. అతన్లో నవరసాల్లో కొన్నైనా ఉన్నాయని నిరూపిస్తాను...ఛాలెంజ్...'' అన్నాను...

నా మాటలకు మందహాసం చేసాడు సారథి.. ''నువ్వలా నిరూపిస్తే నా చెవికోసుకోను కాని నువ్వేదడిగినా ఇస్తాను.. నిరూపించకపోతే నువ్వేమిస్తావు...చెవికోసి ఇవ్వాల్సిన అవసరంలేదు'' అన్నాడు.

''ఎవ్వరమోడిపోయినా మన మిత్రులందరికీ గ్రాండ్‌పార్టీ ఇవ్వాలి... ద్రవపదార్థాలవీ లేకుండా...'' అన్నాను...

సరేనన్నాడు సారథి...నేను లేచి పోబోతుంటే కొద్దిసేపు కూర్చోమన్నాడు... ''చంద్రావు ఎప్పుడైనా మనసువిప్పి నవ్వగా కాని, హాస్య సంభాషణ చేయగా కాని చూసావా...?'' అన్నాడు సారథి...

హాస్యరసం గూర్చి ఇక్కడే తేల్చేద్దామనుకుంటున్నాడని నాకు అర్థమయింది... బాగా ఆలోచించాను... అతడు హాస్యప్రియుడు కాదుగాబట్టి మాట్లాడలేకపోవచ్చు.. చతుర సంభాషణ చెయ్యలేని వాళ్ళెంతోమంది హాస్యాన్ని ఎంజేయ్ చెయ్యడం నాకు తెలుసు...చంద్రావు జోకులెయ్యగా నేనెప్పుడూ చూళ్ళేదు.. హాస్యప్రియుడు కాకున్నా హాస్యాన్ని ఎంజేయ్ చేసిన ఘట్టాల గూర్చి జ్ఞాపకం చేసుకున్నాను.. కాని, ఒక్క సంఘటన కూడా నా స్మృతిపథంలో మెదలడంలేదు... ఎంత చతుర సంభాషణ విన్నా, ఎంత వికృతమైన వస్తువును చూసినా చంద్రావు పెదవులు విప్పీవిప్పకుండా చిరునవ్వు నవ్వాడేకాని హృదయపూర్వకంగా ఎప్పుడూ నవ్వినట్టు నాకు జ్ఞాపకం రాలేదు...నేనాలోచిస్తూవుండగానే రోడ్డు వెంట పోతున్న చంద్రావును సారథి పిలిచాడు... అతడొచ్చి మా దగ్గర కూర్చున్నాడు.. మరికొద్ది క్షణాల్లోనే ఇద్దరు మిత్రులొచ్చి కూర్చున్నారు... ఇంట్లోకెళ్ళి అందరికీ టీ చెయ్యమని చెప్పొచ్చాడు సారథి...

మేము లోకాభిరామాయణంలోపడ్డాము.. మా సంభాషణల్లో అన్ని విషయాలు దొర్లుతున్నాయి...చంద్రావు వింటూ కూర్చున్నాడు.. మా సంభాషణ క్రమక్రమంగా రాజకీయాల మీదికి మళ్లింది...''మన దేశంలో రామారావుగారొక్కరే నిజమైన లెఫ్టిస్ట్...తెలుసా...?''

సారథి మాటలకు మేమంతా నవ్వాము.. చంద్రావు మాత్రం ఆ మాటలు విననట్టే చూస్తూ కూర్చున్నాడు.

''మనదేశంలోని రాజకీయ పార్టీలన్నీ సెక్యులర్ పార్టీలే.. అందులో జమాతే ఇస్లామీ, బిజెపి నూటికి నూరుపాళ్ళు సెక్యులర్ పార్టీలు...'' ఈ శతాబ్దపు జోకనేంత గొప్ప జోక్ వేసాడు మిత్రుడు...

ఆ మాటలకు మేమంతా విరగబడి నవ్వాము...కాని, చంద్రావ్ పెదవి విప్పి మందహాసం చేసి ఊర్కున్నాడు.. అతన్లో ఆ జోకుకు ఏమాత్రం స్పందించిన దాఖలాలు నాకు కనపళ్లేదు... ఇంతలో సారథి భార్య టీ తెచ్చి మాకిచ్చింది... టీ చప్పరిస్తూ మాటల్లో ప్రపంచమంతా తిరిగొచ్చాము...ముఖ్యంగా హాస్య సంభాషణే ఎక్కువ జరిగింది... ఇక నా ఛాలెంజ్‌లోంచి హాస్యరసాన్ని పక్కన పెట్టెయ్యాలని నిర్ణయించుకున్నాను... నేను లేచి నిల్చున్నాను... పనుంది పోతానని సారథితో చెప్పాను....

''మూడయిపోయాయి...'' అన్నాడు నన్ను సాగనంపుతూ సారథి...

''ఇంకా ఆరున్నాయన్న సంగతి మరిచిపోకు...'' అంటూ అక్కణ్నుంచి వెళ్ళొచ్చాను...

ఎలాగైనా సారథితో చేసిన ఛాలెంజ్‌లో గెల్చి తీరాలనుకున్నాను... రసాలగూర్చి స్థాయీభావాలగూర్చి, వాటి స్వరూపం గూర్చి బాగా ఆలోచించాను..రెండు, మూడు రోజులు తీవ్రంగా ఆలోచించాను...చంద్రరావు జీవితాన్ని గూర్చి, అతని పనుల గూర్చి, ప్రవర్తనగూర్చి మననం చేసుకున్నాను.. అతనికి శాంతరసాన్ని వర్తింపచేయవీలవుతుందేమోనని ఆలోచించాను...శాంతము యొక్క స్థాయీ భావం శమము... దాని స్వరూపం వైరాగ్యం వల్ల పుట్టే నిర్వికార చిత్తత.. మహర్షులకు, రుషితుల్యులకే సాధ్యంకాని శమము చంద్రరావులో వుండే అవకాశముందా అని రకరకాలుగా తర్కించాను..చంద్రరావుకుదేని మీదా ఉత్సాహం లేదు. అలాగే వైరాగ్యం కూడా లేదు.. అతన్ని బాగా గమనించి, అతని జీవితాన్ని గూర్చి మననం చేసుకున్న నాకు 'అతడు పుట్టాడు కాబట్టి బతుకుతున్నాడు..బతకాలి కాబట్టి తింటున్నాడు.. భార్య వుంది. కాబట్టి సెక్సులో పాల్గొంటున్నాడు... కుటుంబాన్ని పోషించాలి కాబట్టి ఉద్యోగం చేస్తున్నాడు...'అన్న అభిప్రాయాలు కలిగాయి. ఇక శాంతరసాన్ని గూర్చి నా ప్రయత్నం అనవసరమని నిర్ణయించుకున్నాను...

ఇక మిగిలిన వాట్ని గురించి ఆలోచించాను..కరుణ ఏవ ఏకో రసః (కరుణమొక్కటే రసం) అన్నాడు భవభూతి...కరుణకు స్థాయీ బావం శోకం...దాని స్వరూపం అనిష్టప్రాప్తి వల్ల గాని, ఇష్టజన నాశమువల్ల కాని కలుగు దుఃఖం... మనిషన్న తర్వాత దుఃఖం తప్పకుండా వుంటుందని ఆలోచించాను... అయితే సంవత్సరం క్రితం చంద్రరావుకు రావాల్సిన ప్రమోషన్ అతని జూనియర్‌కు వచ్చినా అతడేమాత్రం విచారించలేదన్న విషయం జ్ఞాపకం చేసుకున్నాను...అది మామూలే అన్నట్లు ఉండి పోవడం జ్ఞాపకం వచ్చింది...మా మిత్రుడికొకతనికి స్కూటర్ ఆక్సిడెంటయితే హాస్పిటల్లో వున్నాడు.. చంద్రరావును తీసుకొని హాస్పిటల్‌కెళ్లాను.. గాయాలతో చావుబతుకుల్లో వున్న మిత్రుణ్ని చూసి నేను చలించిపోయాను.. అప్రయత్నంగానే నా కనుకొలుకుల్నుండి కన్నీటిబొట్లు రాలాయి... కాని చంద్రరావులో ఏ మార్పూ కన్పించలేదు నాకు.. ఏంటీ మనిషని ఆశ్చర్యపోయాను..మరికొద్ది రోజులు గడిచాయి.. చంద్రరావు తల్లి మరణిస్తే ఊరెళ్ళాడు..నాలుగైదు రోజుల్లోనే తిరిగొచ్చాడు...అతన్ని చూడటానికని అతనింటికెళ్ళాను..అతని ముఖంలో పెద్దగా విచారమున్నట్లు నాకు కనపళ్ళేదు...నేనాశ్చర్యపోయాను...

''చంద్రరావ్! కర్మయ్యేవరకైనా ఉండకుండా ఎందుకొచ్చేసావు...? ఇతర్లేమనుకుంటారు...?'' అన్నాను.

''మా అన్నయ్య ఊళ్ళో వున్నాడుగా..అతడే అన్నీ చూసుకుంటాడు.. ఎవరేమనుకుంటారోనన్న భయమేం నాకు లేదు. నాకు సెంటిమెంట్లంటే గిట్టవుగా కర్మనాటికి పోతాను..'' అన్నాడు నిర్మోహమాటంగా.

''మీ అమ్మ మరణం నీకేం దుఃఖం కల్గించినట్టు లేదు'' అన్నాను.

''పుట్టిన ప్రతిప్రాణికీ చావు అనివార్యం..మామూలైన విషయం కొరకు పెద్దగా దుఃఖించాల్సిన విషయమేముంది? ఆమె వృద్ధురాలయింది. ఆయువు మూడింతర్వాత చావు ఆగుతుందా...? మనం ఏడ్చి మొత్తుకున్నంత మాత్రాన ఆమె తిరిగొస్తుందా...?''

ఇక నేనేం మాట్లాడకుండా తిరిగొచ్చాను.. ఇక కరుణరసంగూర్చి ఆలోచించాల్సిన

పనిలేదనుకున్నాను.. రౌద్రరసం గూర్చి నా పరిశోధన మొదలుపెట్టాను.. దీనికి స్థాయీ భావం కోపం.. చంద్రరావు కుటుంబజీవితం గూర్చి, ఆఫీసులో అతని ప్రవర్తన గూర్చి మననం చేసుకున్నాను. ఆఫీసర్‌గారు అన్‌పార్లమెంటరీ భాష కూడా అతనిపై ప్రయోగించాడు.. అయినా చంద్రరావెప్పుడూ ఆఫీసర్‌గారిపై కళ్లెర్ర చేయడం చూళ్లేదు.. అలా తిడ్తుంటే ఎందుకు పడ్తున్నావని మిత్రులడిగితే ఓసారిలా అన్నాడు చంద్రరావు... ''అతడు నాపై అధికారి... తప్పుచేసాను..

తిట్టాడు... ఇందులో విచారించాల్సిందేముంది?''

ఇంట్లో చంద్రరావు భార్య అతన్ని అసమర్థుడని, ఏదీ చేతకాదని తిడ్తుందని తెలుసుకున్నాను... ఆ మాటలకు చంద్రరావుకు కోపం వచ్చిన దాఖలా లెక్కడా నాకు కనపళ్ళేదు. అతన్తో నాకున్న పరిచయాన్ని మననం చేసుకున్న నాకు రౌద్రం గూర్చి తెలుసుకోవడానికి మరింత సమయం వృధా చేయాలన్పించలేదు..

నేనోడిపోతున్నానా...? మిత్రుడు సారథి అన్నీ ఆలోచించే ఈ మాటన్నాడా...? నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.. నాకు ఓడిపోవడం అవమాన కరమేం కాదు.. కాని ఇలాంటి మనుషులు కూడా వుంటారా అని నాకాశ్చర్యం కల్గుతుంది. ఇక మిగిలిన అద్భుత, భయానక బీభత్స రసాల గూర్చి తేల్చుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాను.. అద్భుత రసానికి స్థాయీ భావం విస్మయం... భయానక రసానికి భయం.. విద్యగలవానికెందునూ వింతలేదని పెద్దలు చెప్పినా, అద్భుతమైన, అసాధ్యమైన విషయాలు జరిగినప్పుడు ఆశ్చర్యపోవడం మానవ ప్రకృతి... ఓ రోజు లంచవర్లో నా ఇద్దరు మిత్రులు, చంద్రరావు నేను ఆఫీస్ దగ్గరున్న క్యాంటీన్లో కూర్చున్నాము.. టిఫిన్లవీ ముగించి, టీ తాగి మాటల్లో పడ్డాం...

''నాలుగేళ్ళ పాప కారు నడపడం ఆశ్చర్యకరంగా వుంది...'' అన్నాడో మిత్రుడు...

''అవును... మిమిక్రీ శ్రీనివాస్ ముప్పై రెండు గంటలు కంటిన్యూగా మిమిక్రీ చేయడం చాలా గొప్ప విషయం... ఇదెంతో గొప్ప కళ... గిన్నీస్ బుక్‌లో స్థానం సంపాదించుకున్న శ్రీనివాస్ మన తెలుగువాడైనందుకెంతో ఆనందంగా వుంది...'' అన్నాడు మరో మిత్రుడు...

''పై రెండు విషయాలూ అద్భుతమైనవే... మైనారిటీ కూడా తీరని సచిన్ టెండూల్కర్ ప్రపంచంలోని ఏ బౌలర్‌కూ లొంగకపోవడం, అంతచిన్న వయసులోనేగొప్ప బ్యాట్స్‌మన్‌గా పేరు పొందడం నాకు విస్మయాన్ని కల్గిస్తుంది... రియల్లీ హీ ఈజ్ ఏ గ్రేట్ బ్యాట్స్‌మన్..'' అని '' ఏమంటావ్ చంద్రరావు?'' అన్నాను...

ఇవేవీ చంద్రరావుకు గొప్ప విషయాలుగా అన్పించలేదు... అతని ముఖంలో ఏ మాత్రం మార్పులేదు...

''కొందరికి కొన్నిట్లో టాలెంటుంటుంది...'' అన్నాడు అతి మామూలుగా..

ఆ మాటల కాశ్చర్యపోవడం నావంతయింది... ఇక అద్భుతం సంగతి వదిలెయ్యడమే మంచిదనిపించింది.

పేపర్ తిరగేస్తూ ప్రపంచానికి అణుయుద్ధ ప్రమాదం అనే వార్త చదివి ''ప్రపంచ యుద్ధమంటూ వస్తే జీవరాశులన్నీ నామ రూపాలు లేకుండా పొయ్యే ప్రమాదముంది...'' అన్నాను నేను..

''రెండవ ప్రపంచయుద్ధంలో దెబ్బతిన్న హీరోషిమా నాగసాకి ఇప్పటికీ కోలుకోలేదు... అణుశక్తి రంగంలో ఎంతో అడ్వాన్స్‌డ్ అయింది. ప్రపంచం... ఇప్పుడు యుద్ధమంటూ వస్తే చెప్పేదుందా...?

అదో ప్రళయమన్నట్లే... ఊహించడానికే భయమేస్తుంది...'' అన్నాడు మిత్రుడు...

''యుద్ధం వస్తే పరిస్థితెలా వుంటుందంటావు చంద్రరావు...?'' అడిగాను...

''దాన్ని గురించి భయపడి చావడమెందుకు..? అందరం చస్తే మనం చస్తాం... అంతేకదా...?'' అన్నాడు తేలికగా చంద్రరావు...

''యుద్ధం సంగతేమో కాని మన పరిస్థితి నానాటికీ దిగజారుతుంది.. ఇంక్రిమెంట్, కరువు భత్యం రూపంలో జీతం పెరుగుతున్నా పెరిగే ధరలతో జీతమేవిధంగానూ పోటీపడటం లేదు... ఓ సామాన్య ఉద్యోగి బతడం కష్టమే...'' అన్నాడు రెండో మిత్రుడు...

''మన పరిస్థితి వదిలిపెట్టు... దేశ పరిస్థితే అలా వుంది... భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వోద్యోగులకు జీతాలు దొరకడం కూడా కష్టమేనన్న వార్తను హిందూలో చదివాను...'' అన్నాడింకో మిత్రుడు...

''రేపు మన సంగతీ అంతే... బియ్యం ఇరవై రూపాయలకు కిలో అమ్మినా ఆశ్చర్యపడాల్సిన పన్లేదు.. మరో దిక్కు జీతాలు రావడం కష్టం కావచ్చు'' అన్నాను నేను.. చంద్రరావుముఖం వంక చూశాను... ఆతని ముఖంలో కొంచెం భయం కన్పించింది.

''చాలీ చాలనివైనా జీతాలు రాకపోవడమనేది ఉద్యోగులకు అనూహ్యామైన విషయం..'' అన్నాడు మిత్రుడు.

చంద్రరావులో కొంత బతుకు భయమున్నట్టు గమనించాను... కాని అది రసస్థాయికెదిగేంత ఉందని చెప్పడం కష్టం...

రిస్టువాచీ చూసి ఉలిక్కిపడి లేచి ఆఫీసు కెళ్ళాము..

ఇంకెన్నో విధాలుగా చంద్రరావును పరీక్షించాను... అతని జీవిత విధానాన్ని, అలవాట్లను శ్రద్ధగా గమనించాను... రకరకాల సంఘటనలకు ఆతని స్పందనను గమనించాను. నాకు నేను సమాధానం చెప్పుకుందామన్నా పై ఎనిమిది రసాల్లో ఏ ఒక్కటీ ఆతనిలో ఉన్నాయని చెప్పడానికి నాకు ధైర్యం చాలడం లేదు.. నేనోడి పోతున్నానన్న విషయం నాకర్థమవుతూనే వుంది.. ఇక మిగిలిన భీభత్సరసం గూర్చి కూడా తెలుసుకొని మిత్రుని ముందు ఓటమినంగీకరించానికే నిర్ణయించుకున్నాను...

కన్యాశుల్కం భీభత్సరస ప్రధానమైన విషదాంత నాటకమని శ్రీ శ్రీ చెప్పినట్టు చదివాను.. శ్రీ శ్రీ స్టేట్‌మెంట్‌ను నిరూపించడమే కాకుండా, నేటి ప్రధానరసం బీభత్సమే అని సోదాహరణంగా రుజువుచేసిన విమర్శకుడి వ్యాసాలు చదివాను... భీభత్సరసానికి స్థాయి భావం జుగుప్స... దాని స్వరూపం వస్తుదోష సందర్శనాదుల వల్లకలిగే రోత... రోత కల్గించే సంఘటనలను చూపి చంద్రరావులో జుగుప్స కలిగేట్టు చేయాలని పథకం వేసుకున్నాను... ఈ చివరి ప్రయత్నంలోనైనా నెగ్గాలని పట్టుదలతో వున్నాను...

ఓ రోజు చంద్రరావును తీసుకొని నడుస్తున్నాను... ఓ చెత్తకుండీ దగ్గర ఓ మనిషున్నాడు... ఆతని వెంట్రుకలు జడలుగట్టున్నాయి... కాళ్ళు చేతులు దుమ్ముగొట్టున్నాయి... మొలకు చిన్న గుడ్డ తప్ప శరీరంపై ఏ ఆచ్ఛాదనాలేదు... ఆతని డొక్క వెన్నుకంటుకు పోయింది... కళ్లు పాతాళంలో వున్నాయి... శరీరమంతా కమిలిపోయి నల్లగా వికృతంగా వుంది... కట్టెతో చెత్తకుండీని తవ్వుతూ ఇనుపముక్కల నేరుకుంటూ సంచీలో వేసుకుంటున్నాడు... ఆతన్నిచూసిన నాకు రోత కల్గింది... ఆతనాస్థితికి కారణమైన సమాజంపై

కోపం కూడా కల్గింది... చంద్రరావ్ అతన్నేమీ పట్టించుకోకుండానే నడుస్తున్నాడు... మేమిద్దరం ఓ మురికివాడకు చేరాము. మొలమీద చిన్నగుడ్డ లైనా లేని చిన్నపిల్లలను చూశాము... పెరిగిన బొత్తలతో మూర్తీభవించిన అనారోగ్యంతో వున్న భావిభరతపౌరులను చూశాం.. ఈగలను దోమలను తోలుకుంటూ జుబ్బరజుబ్బర ఈగలు ముసురుతున్న గంజీనీళ్లను ఆత్రంగా తాగుతున్న చిన్నారులనుచూశాము... మురికి నిలయాలపైన చెత్తకుండీల పక్కనే మురికి కాలువల పక్కనే కాపురముంటున్న కుటుంబాలను చూశాము ఇవన్నీమామూలే అన్నట్టుగా చూస్తున్నాము కాని చంద్రరావులో ఏ స్పందనా నాకు కన్పించలేదు. దేశంలోని దుర్భర దారిద్ర్యం గూర్చిచంద్రరావుతో చెప్పాను.. కేవలం పొట్టకూటికోసమే శరీరాన్నమ్ముకోవాల్స వస్తున్న పరిస్థితుల గూర్చి చెప్పాను.. హోటల్ల దగ్గరున్న చెత్తకుండీల దగ్గర పారేసే అన్నం కోసం కుక్కలతో కొట్లాడే అభాగ్యుల గూర్చి చెప్పాను.. అవన్నీమామూలే అన్నట్లు చూశాడు కాని నా మాటల ప్రభావం, చూపించిన సంఘటనల ప్రభావం ఆతనిమీదే మున్నట్లు నాకన్పించలేదు.

ఇకనా ప్రయత్నాన్ని విరమించుకున్నాను... సారథి ముందు సంతోషంగా ఓటమి నంగీకరించాను.. ఎంతో ఆలోచనా శీలియైనసారథి నభినందించాను... కాని చంద్రరావు ప్రవర్తనే నాకు మింగుడు పడటంలేదు. సారథితో అదే మాటన్నాను...

''సమాజమనే కావ్యంలో ఎన్నోరసాలుండగా చంద్రరావులో దేనికీ స్పందించని గుణం ఉండటం నాకు ఆశ్చర్యకరంగా వుంది... అతన్నిచూస్తుంటే ఇలాంటి మనుషులు కూడా ఉంటారా అనిపిస్తుంది..''

''మనోహర్! కొంచెం నిదానంగా ఆలోచిస్తే నీకే తెలుస్తుంది...చంద్రరావంత కాకున్నా ఆతని మనస్తత్వం గల వాళ్లే ఈ దేశంలో ఎక్కువ మందున్నారు... చంద్రరావు ఈ దేశంలోని మధ్య తరగతి మనస్తత్వానికి సజీవ ఉదాహరణ. జీవచ్ఛవాలుగా బతుకుతున్న లక్షలాది మందికి ప్రతీక... మిన్ను విరిగి మీదపడినా, తనచుట్టూ సమాజంలో ఏం జరుగుతున్నా దేశంలో ఏం జరుగుతున్నా, ఎంత అల్లకల్లోలమున్నా వీళ్ళు పట్టించుకోరు... ఒకప్పుడు మధ్యతరగతి వాళ్లు ఎంతో ప్రగతిశీల పాత్ర వహించారు... స్వాతంత్ర్య పోరాటంలోనూ ముఖ్యపాత్ర వహిచారు... కాని, క్రమక్రమంగా వాళ్లు ఘనీభవించుకు పోయారు... వాళ్ళలో ఒక్కో రసం హరించుకుపోయింది... ఒక్క భయం అడుగడుగునా భయం- అదీ బతుకుభయం తప్ప వాళ్లలో ఇంకేం మిగలలేదు.. దేన్నీపట్టించుకోని, ఏ సంఘటనకూ స్పందించని, ఏ ఉద్యమానికీ బాసటగా నిలువని ఈ మనస్తత్వం మనదేశంలోని మెజారిటీ జనాల్లో వుంది. ఈ మనస్తత్వమే లేకుంటే- మధ్యతరగతి జనాల్లో అన్నిటికీ స్పందించేగుణమే వుంటే - దేశపరిస్థితి మరోలా ఉండేదేమో..?'' అన్నాడు సారథి...

సారథి మాటల్లో ఎన్నో అర్థాలు, మరెన్నో భావాలు స్ఫురించాయి నాకు... దాదాపు ఆరునెలలుగా, చంద్రరావును గూర్చి చేసినపరిశోధన నాకెన్నో జీవిత సత్యాలను నేర్పింది... వాటి వెలుగులో సారథి మాటల గూర్చి ఆలోచిస్తూ ఇంటికెళ్ళాను...

*ఆదివారం ఈనాడు 8-9-91*